క్లుప్తంగా

పాడి రైతుల సమస్యల పరిష్కారానికి కృషి



పెడన: పాడి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కృష్ణా మిల్క్‌యూనియన్ ఆధ్వర్యంలో అన్ని చర్యలు తీసుకుంటున్నామని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. శనివారం ఆయన పెడనలోని పాల ఉత్పత్తిదారుల పరిపతి సహకార సంఘాన్ని సందర్శించారు. పాడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంఘ అధ్యక్షుడు అబ్దుల్ ఖయ్యూం (హస్ను) చైర్మన్‌ను దుశ్శాలువాతో సత్కరించారు. ఈయనతో పాటు సంఘం జిల్లా డైరెక్టర్, పెడన జెడ్పీటీసీ అర్జా వెంకటనగేష్, పాడి రైతులు, సంఘ సిబ్బంది ఉన్నారు.

యోగాతో మానసిక వికాసం



ఘంటసాలపాలెం(ఘంటసాల): యోగాతో మానసిక వికాసం కలుగుతుందని ఎంపీడీవో డి.సుబ్బారావు అన్నారు. మండలంలోని ఘంటసాలపాలెం సచివాలయం పరిధిలో శనివారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, గ్రామస్తులతో పంచాయతీ కార్యదర్శి బోలెం అర్జునరావు ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది, ప్రజలతో ఎంపీడీవో సుబ్బారావు యోగాసనాలు వేయించారు. యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాలపాలెం సచివాలయ పరిధిలోని ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు సీజ్



కోడూరు: అక్రమంగా మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు శనివారం సీజ్ చేశారు. మండలంలోని విశ్వనాథపల్లి గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేసినట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ జలగం సౌజన్య తెలిపారు. మట్టిని ట్రాక్టర్లలో నింపుతున్న జేసీబీ, మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి కార్యాలయానికి తరలించామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తవ్వకాలు జరపడంతో నిర్వాహకులకు రూ.19 వేలు జరిమానా విధించినట్లు సౌజన్య చెప్పారు. మరోసారి అక్రమంగా మట్టిని తరలిస్తూ వాహనాలు పట్టుబడితే నిర్వాహకులపై క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

రహదారి మార్జిన్‌కు బీటలు

- కోడూరు– అవనిగడ్డ రహదారి నిర్మాణంలో లోపించిన నాణ్యత
- నిర్మాణదశలోనే కుంగిపోతున్న రహదారి మార్జిన్లు
- ఆరు చోట్ల బీటలు వారి కాలువ వైపు జారిపోతున్న వైనం
- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు, పాలకులు



జయపురం-వి.కొత్తపాలెం గ్రామాల మధ్య కాలువ వైపు బీటలు వారిన రహదారి మార్జిన్



మార్జిన్ కుంగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న క్వాలిటీ అధికారులు (ఫైల్)

కోడూరు: కోడూరు– అవనిగడ్డ ప్రధాన రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత పూర్తిగా లోపించింది. ఆర్ అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ పనులను ఇష్టానుసారంగా చేయడంతో రహదారి నిర్మాణదశలో ఉండగానే మార్జిన్లు కుంగిపోతున్నాయి. రహదారి అంచులు బీటలు వారి పక్కనే ఉన్న కాలువ వైపు జారిపోతున్నాయి. దీంతో రహదారి పటిష్టతపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అప్పట్లో ఇలా..

గతంలో కృష్ణా పుష్కరాల సమయంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం కోడూరు– అవనిగడ్డ రహదారిని పుష్కర నిధులతో నిర్మించింది. అయితే నిర్మాణ సమయంలో నాణ్యత పాటించకపోవడంతో ఏడాదికే రహదారి శిథిలావస్థకు చేరింది. రహదారి పొడవునా భారీ గుంతలు పడి ప్రమాదభరితంగా మారింది. దీంతో మండల ప్రజలకు అప్పటి టీడీపీ ప్రభుత్వం నుంచే రహదారి కష్టాలు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచి 2024 ఎన్నికల ముందు వరకు మండల ప్రజలు ఈ రహదారిపై ప్రయాణించేందుకు పడరాని కష్టాలు పడ్డారు.

కూటమి ప్రభుత్వం రాగానే నిలిచిన పనులు..

2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే కోడూరు– అవనిగడ్డ రహదారి నిర్మాణ పనులను మళ్లీ నిలిపివేశారు. దీంతో వెట్ మిక్స్ మెకడమ్ లేయర్‌కు సంబంధించిన కంకరరాళ్లు, దుమ్ము వల్ల ఏడాది పాటు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే రహదారి పనులను నిలిపివేయడంపై మండల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవడంతో మూడు నెలల క్రితం నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించారు.

పూర్తిగా లోపించిన నాణ్యత

కోడూరు– అవనిగడ్డ రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యత పూర్తిగా లోపించిందని ప్రజలు విమర్శిస్తున్నారు. పనులను ఇష్టానుసారంగా చేస్తున్నారే గాని నాణ్యతా ప్రమాణాలపై దృష్టి పెట్టడటం లేదని మండిపడుతున్నారు. రహదారి కుంగే అవకాశాలు ఉన్న ప్రాంతాలను గుర్తించకుండా పనులను మసిపూసి మారేడు కాయ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కుంగిపోయిన రహదారి మార్జిన్లు..

ప్రస్తుతం కృష్ణాపురం– జయపురం, జయపురం– వి.కొత్తపాలెం గ్రామాల మధ్య రహదారి మార్జిన్లు కుంగిపోయాయి. సుమారు ఆరు చోట్ల మార్జిన్లు కుంగి కాలువ వైపు జారిపోయింది. మార్జిన్ అంచు వెంట రహదారి కూడా బీటలు వారింది. నిర్మాణ దశలోనే మార్జిన్లు కుంగిపోయి నెర్రలివ్వడంతో రోడ్డు నాణ్యతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం కాలువకు ఏవిధమైన ఆధునీకరణ పనులు చేయకుండానే నిర్మాణదశలోనే మార్జిన్లు కుంగుతుంటే కాలువకు పనులు చేస్తే రహదారి ధ్వంసమయ్యే అవకాశాలు ఉన్నాయని నిపుణులు అంటున్నారు. ఇటీవల క్వాలిటీ అధికారులు బృందం ఈ బీటలు వారిన ప్రాంతాలను పరిశీలించి, కాంట్రాక్టర్ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు

ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మార్జిన్లు కుంగి నెర్రెలు ఏర్పడినా వాటిని మరమ్మతులు చేసే ప్రయత్నం కూడా చేయడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. నూతన రహదారిని నిర్మిస్తున్నారని ఆనంద పడే లోపే మార్జిన్లు కుంగిపోతున్నాయని వాపోతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు రహదారి నాణ్యతపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

రూ.16.80 కోట్లు కేటాయించిన గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎన్నికలకు ఆరు నెలల ముందు ఈ రహదారి నిర్మాణానికి రూ.16.80 కోట్ల నిధులు కేటాయించింది. నిధులు కేటాయించడంతో పాటు నిర్మాణ పనులను కూడా ప్రారంభించి, పనులు వేగవంతంగా నిర్వహించింది. కోడూరు నుంచి అవనిగడ్డ వరకు 13కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా, ఎనిమిది కిలోమీటర్ల మేర జీఎస్‌బీ, వెట్‌మిక్స్ మెకడమ్ పనులు చేపట్టింది. సుమారు 40 శాతం పనులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే పూర్తి చేసింది.

మండల పరిషత్ ఏఓగా రామకృష్ణ



గూడూరు: మండల పరిషత్ పరిపాలన అధికారి, ఇన్‌చార్జి ఎంపీడీవో మోటేపల్లి వనజ బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో అవనిగడ్డ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న కె.వి.రామకృష్ణను అధికారులు నియమించారు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు.

ఘనంగా ఆలయ 11వ వార్షికోత్సవం

బంటుమిల్లి: స్థానిక అయ్యప్పస్వామి దేవాలయ 11వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. పూజలు, రుద్రాభిషేకాలు చేశారు. అనంతరం గణపతి హోమం పండితుల వేద మంత్రాల మధ్య నిర్వహించి పూర్ణాహుతి చేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. కమిటీ సభ్యులు యిల్లూరి లీలాకృష్ణ, మలిశెట్టి నాగబాబు, వెచ్చా కృష్ణమూర్తి, కంఠమనేని మురళీమోహన్‌రావు,యర్రంశెట్టి నాగేశ్వరరావు, సీతారామయ్య, దూతల రాంబాబు, దేవత గుప్త, బండ్రెడ్డి ఆంజనేయులు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతి హోమం

గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్డులోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానంలో లక్ష్మీ గణపతి హోమం శనివారం ఘనంగా నిర్వహించారు. సంకట హర చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని హోమం నిర్వహించినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాసరావు తెలిపారు. కపిలవాయి అశోక్ శాస్త్రి బృందం పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు పూర్ణాహుతితో ముగిశాయి.116 మంది ఉభయ దంపతులు పూజలు చేశారు.

రెండో రోజూ కొనసాగిన ఉర్వేళమ్మ జాతర



మదార్ సాహెబ్ జెండా ఊరేగింపు

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామ దేవత ఉర్వేళమ్మ శత వసంతాల జాతర మహోత్సవంలో రెండో రోజు పూర్వీకుల సంప్రదాయాన్ని అనుసరించి మత సామరస్యాన్ని చాటుతూ శనివారం గ్రామంలో మదార్ సాహెబ్ జెండా ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. భావదేవరపల్లి సమీపంలోని మస్లిమ్ గ్రామం పెదగుడుమోటు వాసి మదీనాకృష్ణ అనే పెద్ద, మత సంప్రదాయ జెండా చేతబూని ఊరేగింపు జరిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మదార్ సాహెబ్‌కు నారికేళం, అగరవత్తులు చిల్లర డబ్బులు ఇచ్చారు. తదుపరి గుడారం వద్దకు చేరుకుని మదార్ సాహెబ్‌కు మూడేసి చొప్పున రొట్టెలు, గంధపు ఉండలు, చుట్టలు, జెండాలు, నాణేలు సమర్పించారు. అనంతరం గ్రామస్తులంతా కలసి మద్దిరావమ్మ స్థావరానికి వేడినైవేద్యాలతో భారీ ఊరేగింపుతో తరలి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, గ్రామ సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, ముమ్మారెడ్డి వెంకట సాంబశివరావు, భక్తులు పాల్గొన్నారు.

నేడు గుడి సంబరం

మూడో రోజు ఆదివారం ఉర్వేళమ్మ తల్లి జాతర మహోత్సవం కార్యక్రమాలు జరుగుతాయని ధర్మకర్త విశ్వేశ్వరరావు చెప్పారు. ఉదయం అమ్మవారికి పూజ, రాత్రి 7 గంటలకు వేడి నైవేద్యాలతో ఊరేగింపు, 10 గంటలకు గుడి సంబరం జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా భోగాది సాయికుమార్, గ్రామ యువత ఆధ్వర్యంలో కేరళ సంప్రదాయ చండీమేళం (సింగేరి మేళం) ఏర్పాటు చేశారు.

లంకపల్లి బ్రాంచి కాలువకు సాగునీరు విడుదల



లంకపల్లి బ్రాంచి కాలువకు సాగునీరు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్

దాలిపర్రు(ఘంటసాల): మండలంలోని దాలిపర్రు వద్ద లంకపల్లి బ్రాంచి కాలువలోకి నాలుగు మోటార్ల ద్వారా సాగునీటిని విడుదల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఘంటసాల, చల్లపల్లి మండలాల పరిధిలోని దాలిపర్రు, యండకుదురు, పూషడం, లంకపల్లి, మాజేరు గ్రామాల్లోని 3,500 ఎకరాలకు దాలిపర్రు ఎత్తిపోతల పథకం ద్వారా యండకుదురు, లంకపల్లి బ్రాంచి కాలువల ద్వారా సాగునీరందిస్తున్నట్లు చెప్పారు. సముద్రపు నీరు ఎగువకు రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ మచిలీపట్నం సబ్ డివిజన్ డీఈఈ అపర్ణ, ఏఈఈ టీ.వీరాంజనేయులు, తూర్పు కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవబోయిన వెంకటేశ్వరరావు, శ్రీకాకుళం డీసీ చైర్మన్ అయినపూడి భాను ప్రకాష్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, కోసూరు డీసీ వైస్ చైర్మన్ పరిశే చలపతి, దిరిశం వెంకట్రావు, మిక్కిలినేని మధు, వీరమాచినేని భవాని ప్రసాద్, బండి పరాత్పరరావు, కొమ్మారెడ్డి లీలాకృష్ణ, తుమ్మల చౌదరి బాబు రైతులు పాల్గొన్నారు.

ఏపీ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా వీరబాబు



బంటుమిల్లి: ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడిగా వైఎస్సార్ సీపీ నాయకుడు, మల్లేశ్వరం ఎంపీటీసీ పేపేటి వీరబాబును నియమిస్తూ జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టరు ఎస్.మారేష్ నియామక పత్రం అందజేశారు. ఈ నెల 13న హైదరాబాదులో వీరబాబుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ పార్టీలకతీతంగా జిల్లాలో బీసీలకు అండగా ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మండల బీసీ సంఘ నాయకులు కందుల నాగేశ్వరరావు, మన్నె బుజ్జి, కుంభం బాబు, జొన్నలగడ్డ పాండురంగారావు తదితరులు కృష్ణయ్య, మారేష్, వీరబాబులకు అభినందనలు తెలిపారు.

భక్తులను అప్రమత్తం చేసేందుకు ఏర్పాట్లు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లి గ్రామంలో ఉత్తరవాహినిగా ప్రవహిస్తున్న కృష్ణాఘాట్ వద్ద పబ్లిక్ అడ్రసింగ్ సిస్టంను (భక్తులను అప్రమత్తం చేసేందుకు ప్రచారం) ఎస్‌ఐ సత్యనారాయణ శనివారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ప్రధాన ఘాట్‌వద్ద నిరంతరం పంచాక్షరి మంత్రం వినిపించే విధంగా ఈ సిస్టం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నది ప్రాంతంలో స్నానమాచరించే భక్తులు అప్రమత్తంగా ఉండి లోపల వరకు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, దేవాలయ పరిసర ప్రాంతాల్లో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకుండా ఉండాలని, దూమపానం, మద్యపానం వంటివి చేయకుండా తెలియజేసేలా గ్రామ సచివాలయం తరఫున ఈ పబ్లిక్ అడ్రసింగ్ సిస్టం ఏర్పాటు చేసినట్టు వివరించారు. గ్రామ ప్రముఖులు అరజా కిరణ్‌కాంత్, గొర్రెపాటి దుర్గా నాగేశ్వరావు, నాని తదితరులు పాల్గొన్నారు.

జనరల్ బోగీలు పెంచాలని వినతి



రైల్వే అధికారులకు వినతి పత్రాన్ని అందజేస్తున్న సీపీఎం నాయకులు

మచిలీపట్నంటౌన్: కృష్ణా జిల్లా కేంద్రమైన మచిలీపట్నం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య రోజు రోజుకీ పెరుగుతున్న దృష్ట్యా మచిలీపట్నం నుంచి హైదరాబాదు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో తగ్గించిన జనరల్ బోగీల సంఖ్య వెంటనే పెంచాలని సీపీఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం రైల్వే అధికారులను డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఎం మచిలీపట్నం నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం మచిలీపట్నం రైల్వే స్టేషన్ స్టేషన్ మాస్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మచిలీపట్నం నుంచి హైదరాబాదు వెళ్లే ట్రైన్ నంబర్ 12749/12750 ఎక్స్‌ప్రెస్‌కు ముందు భాగంలో రెండు వెనుక భాగంలో రెండు గతంలో జనరల్ బోగీలు ఉండేవన్నారు. మహిళలు, వికలాంగులకు చెరొక బోగీలు ఉండేవన్నారు. పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా జనరల్ బోగీలను పెంచకుండా తగ్గించడం దురదృష్టకరమన్నారు. గతంలోని నాలుగు జనరల్ బోగిలను ప్రస్తుతం రెండుకు తగ్గించడం వలన నిరుపేద ప్రయాణికులు, గర్భిణి మహిళలు, చిన్నపిల్లలు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందన్నారు. అందువల్ల మచిలీపట్నం నుంచి హైదరాబాదు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలుకు జనరల్ బోగీల సంఖ్య వెంటనే పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. మచిలీపట్నం రైల్వే స్టేషన్‌లో ఒక ప్లాట్ఫారం నుంచి మరొక ప్లాట్ఫారం వెళ్లేందుకు ఎస్కలేటరు ఏర్పాటు చేయాలని కోరారు. మచిలీపట్నం నుంచి సికింద్రాబాద్‌కు ఉదయం వేళలో మరొక రైలు నడపాలని ఆయన రైల్వే అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు కొడాలి శర్మ, నగర కమిటీ సభ్యులు సీహెచ్ జయరావు, టి.చంద్రపాల్, రావి వెంకట్రావు, డి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ సెంటర్

ప్రిన్సిపాల్ కృష్ణమోహన్



ప్రిన్సిపాల్ కృష్ణమోహన్

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి పాలీసెట్ కౌన్సెలింగ్ సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ప్రిన్సిపాల్ వీవీ కృష్ణమోహన్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ కళాశాలలో ఏర్పా టు చేసిన కౌన్సెలింగ్ సెంటర్‌లో ఈ నెల 21వ తేదీ నుంచి విద్యార్థుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్, వెబ్ ఆప్షన్ ప్రక్రియ జరుగుతుందన్నారు. గతంలో విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మాత్రమే వెరిఫికేషన్ కార్యక్రమం జరిగేదని ఆయన చెప్పారు. ఈ ప్రాంత విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సౌకర్యార్థం గన్నవరంలో కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని ఆయన వివరించారు. స్థానికంగా ఉన్న సైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ కోర్సులతో పాటు ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలో ప్రవేశాలకు విద్యార్థులు కౌన్సెలింగ్ సెంటర్‌ను వినియోగించుకోవాలని కోరారు. స్థానిక చదివిన విద్యార్థుల్లో 90 శాతం మందికి ఉద్యోగ అవకాశాలు లభించినట్లు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వీ ఎలీషా తెలిపారు. ప్రస్తుతం సాంకేతిక విద్యనభ్యసించిన విద్యార్థులకు చక్కటి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

రోడ్లు వేశారు.. మార్జిన్లు మరిచారు



కృష్ణా సహకార బ్యాంకు రోడ్డులో మార్జిన్ దిగిన కారు



మల్లవోలులో మార్జిన్లు వేయకుండా వదిలేసిన సీసీ రోడ్డు

గూడూరు:గ్రామాల్లో అంతర్గత రోడ్లకు మార్జిన్లు వేయకోవడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శాశ్వత ప్రాతిపదికన రూ.లక్షలాది నిధులతో మండలంలోని ప్రతి గ్రామంలో అంతర్గత రోడ్లను సిమెంటు రోడ్లుగా అభివృద్ధి చేశారు. రోడ్లు వేసి ఆరు నెలలు కావస్తున్నప్పటికీ రోడ్డు వెంబడి మార్జిన్లు వేయకపోవడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు వాహనదారుల పరిస్థితి వర్ణనాతీతం. అంతర్గతంగా ఉండే రోడ్ల వెడల్పు తక్కువ కావడం, మార్జిన్లు వేయకపోవడం వల్ల కనీసం ద్విచక్ర వాహనాన్ని తప్పించుకుని ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉత్పన్నం అవుతుంది. సాహసం చేసి మార్జిన్ వెంబడి వెళ్లే ప్రయత్నం చేస్తే అదుపుతప్పి మార్జిన్‌లో వాహనాలు దిగబడిపోతున్నాయి. వాటిని తిరిగి రోడ్డు ఎక్కించడానికి నానా కష్టాలు పడాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సిమెంటు రోడ్లకు మార్జిన్లు ఏర్పాటు చేసే వాహనదారులకు కష్టాలు తీరుతాయని కోరుతున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు

పెడన: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే చర్యలు తీసుకుంటామని పెడన ఎస్‌ఐ జి. సత్యనారాయణ స్పష్టం చేశారు. శనివారం పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నవారిని, మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడుపుతున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ నిఘా ఉంచి ఇటువంటి వారిని అదుపులోకి తీసుకుని కోర్టుకు హాజరుస్తామని తెలిపారు.

రూ.822 కోట్లతో అభివృద్ధి పనులు

అవనిగడ్డ: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తొలి ఏడాదిలో అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.822 కోట్ల మేర అభివృద్ధి పనులు జరిగినట్టు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ చెప్పారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పలు శాఖల ద్వారా రూ.601 కోట్లు, సంక్షేమ కార్యక్రమాల ద్వారా రూ.221 కోట్లు ఖర్చు చేసినట్టు తెలిపారు. గుల్లలమోదలో రూ.20 వేల కోట్ల వ్యయంతో క్షిపణి ప్రయోగ కేంద్రానికి శంకుస్థాపన జరగడం గొప్పవిషయమన్నారు. నాగాయలంకలో వాటర్ అకాడమీని అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. దివిసీమ ప్రజల జీవనాడి అయిన పులిగడ్డ అక్విడెక్టు పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



చల్లపల్లి: స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం 23వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారి కల్యాణ మహోత్సవం, సాయంత్రం నుంచి స్వామివారు అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు స్వామి వారికి టెంకాయలు, హారతులు ఇచ్చి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

రక్తదాతలే ప్రాణదాతలు



83సార్లు రక్తదానం చేసిన రామకృష్ణను సన్మానిస్తున్న డీఆర్వో చంద్రశేఖరరావు

గుడ్లవల్లేరు: ఆపదలో ఉన్న ఎంతోమందిని కాపాడే ప్రాణదాతలే రక్తదాతలు అని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాటికల్ సైన్సెస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఐపీఎ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఫార్మసీ విద్యార్థులతో పాటు స్థానిక లయన్స్ సేవాభవన్‌లో కూడా రక్తదానం చేశారు. డీఆర్వో చంద్రశేఖరరావు మాట్లాడుతూ రక్తదానం మానవతా సేవ అని అన్నారు. తరచూ రక్తదానం, సేవ, డిజాస్టర్ మేనేజ్మెంట్ తదితర కార్యక్రమాలు సంయుక్త నిర్వహణకు కృష్ణా జిల్లా రెడ్ క్రాస్‌తో అవగాహన ఒప్పందం చేసుకున్నామని ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలియజేశారు. జిల్లా రెడ్ క్రాస్ సెక్రటరీ భవిరి శంకర్‌నాథ్ మాట్లాడారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అత్యధిక యూనిట్లు రక్తదానం చేసిన గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల తరఫున ప్రిన్సిపాల్ కరుణ కుమార్, ప్రిన్సిపాల్ లక్ష్మణరావు, స్టార్ విద్యాసంస్థల డైరెక్టర్ అయ్యప్ప స్వామి, గోద్రెజ్ ఆగ్రో వెట్ సంస్థను, 83 సార్లు రక్తదానం చేసిన మాచర్ల రామకృష్ణను రెడ్ క్రాస్ తరఫున ఘనంగా సత్కరించారు. చంద్రశేఖరరావు, జిల్లా సెక్రటరీ శంకర్ నాథ్, ట్రెజరర్ రామ్ బాలాజీను కాలేజీ యాజమాన్యం సత్కరించింది.